విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

బుధవారం 10 జూలై 2024 8 పేజీలు

నిత్యావసర ధరలను నియంత్రించాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి

విశాలాంధ్ర-ఒంగోలు : పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలన్న రాష్ట్ర ప్రభుత్వ విధానంలో భాగంగా ప్రకాశం జిల్లాలో తీసుకోవాల్సిన చర్యలు గూర్చి జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్లోని మీకోసం సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించడం జరిగింది. సంబంధిత డిపార్ట్మెంట్ అధికారులు బియ్యం కందిపప్పు మిల్లుల యజమానులు, వ్యాపారస్తులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తూ జాయింట్ కలెక్టర్ బియ్యం కందిపప్పు అమ్మడానికి నగరంలోని మూడు రైతు బజార్లలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని అటువంటి కౌంటర్ల నుండి మంచి నాణ్యమైన బీపీటీ బియ్యం స్టీమ్ చేసినవి కిలో రూ.49కే పచ్చి బియ్యం కిలో 48 రూపాయలకి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. అదేవిధంగా కందిపప్పు కూడా కిలో 160 రూపాయలకు అందుబాటులో ఉంటుందని తెలియజేశారు. ఈ కౌంటర్ల ఏర్పాటు కోసం వివిధ రైతు బజార్లను సందర్శించిన జాయింట్ కలెక్టర్ రైతు బజార్ల మౌలిక సదుపాయాలు పట్ల అసంతృప్తి వ్యక్తపరిచారు. రైతు బజార్లలో పారిశుద్ధ్యం టాయిలెట్ల నిర్వహణ మరింత మెరుగుపడాలని తెలిపారు.

ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా

విశాలాంధ్ర-ఒంగోలు : ఆసుపత్రులకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు వారితో సత్ ప్రవర్తన కలిగి ఉండడం కూడా కీలకమని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. మంగళవారం ఆమె వైద్య శాఖలోని వివిధ విభాగాల ఉన్నతాధికారులతో ప్రకాశం భవనంలో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ప్రజలకు అందజేస్తున్న సేవలు, ఇందు కోసం విభాగాల వారీగా ఉన్న సిబ్బంది వివరాలపై ఆమె అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రులలో పారిశుధ్యము, సెక్యూరిటీ విషయంలో ఎలాంటి నిర్లక్ష్యమూ ఉండరాదని ఆమె స్పష్టం చేశారు. రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని ఆమె చెప్పారు. వైద్యులెవరైనా అనుమతి లేకుండా సెలవు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. రోగుల కోసం టాయిలెట్లు, తాగునీరు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో తీసుకున్న నిర్ణయాలు, ఇచ్చిన ఆదేశాలు కేవలం కాగితాలపైనే మిగిలిపోకుండా క్షేత్రస్థాయిలో అవి అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ఆయా విభాగాల ఉన్నతాధికారులదేనని కలెక్టర్ స్పష్టం చేశారు. ఉన్న సిబ్బందిని సమర్థంగా సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ సమావేశంలో ఇన్చార్జ్ డి.ఎం. హెచ్.ఓ. మరియు జిల్లా క్షయ, కుష్టు, ఎయిడ్స్ నివారణ అధికారి సురేష్ కుమార్, డి.సి.హెచ్. ఎస్. శేషకుమార్, డి.ఐ.ఓ. పద్మజ, ఒంగోలు ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ ఏడుకొండలరావు, డిప్యూటీ సూపరింటెండెంట్లు ప్రభాకర్, బాలాజీ నాయక్, మార్కాపురం ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజమన్నార్, సూపరింటెండెంట్ సావిత్రి, ఆరోగ్యశ్రీ జిల్లా కో-ఆర్డినేటర్ హేమంత్, జిల్లా మలేరియా అధికారి మాధవీలత, డిప్యూటీ డి.ఎం. హెచ్. ఓ.లు పాల్గొన్నారు.

విద్యాశాఖ పైనా :

అనంతరం విద్యాశాఖపైనా కలెక్టర్ సమీక్షించారు. అకడమిక్, ఎస్టాబ్లిష్మెంట్ కార్యకలాపాలు, - విద్యాలయాలలో చేపడుతున్న నిర్మాణాలు, ఇన్ క్లూజివ్ ఎడ్యుకేషన్ కార్యకలాపాలతో పాటు వివిధ యాజమాన్యాల క్రింద ఉన్న పాఠశాలల వివరాలు, వాటిలోని విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తాగునీరు, పారిశుధ్యము, ప్రహరీగోడ, తదితర అంశాలకు సంబంధించిన వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. బడి వయస్సు పిల్లలందరూ బడిలో ఉండేలా చూడాలని, వారికి నాణ్యమైన విద్య అందించాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈ సమావేశంలో డి.ఈ.ఓ. శ్రీమతి సుభద్ర, డిప్యూటీ విద్యాధికారులు అనితారోజ్ రాణి, చంద్ర మౌళీశ్వర్, ఏ.పి.ఈ.డబ్ల్యు.ఐ.డి.సి పాల్గొన్నారు.

ఊపందుకోనున్న నిర్మాణరంగం

- ఉచిత ఇసుక పాలసీతో నెరవేరనున్న పేదల సొంతింటి కల
- రాష్ట్ర ప్రగతికి బాటలు వేయనున్న ప్రభుత్వ నిర్ణయం
- ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య

విశాలాంధ్ర - చీరాల : తమ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక పాలసీతో రాష్ట్రంలో నిర్మాణరంగం ఊపందుకుంటుందని ఇది రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందని చీరాల ఎమ్మెల్యే మద్దులూరి మాలకొండయ్య అన్నారు. ఉచిత ఇసుక అందుబాటులోకి రావడంతో పేదల సొంతింటి కలనెరవేరుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నెలరోజులలోపే అమలులోకి తెచ్చారని సంతోషం వ్యక్తం చేశారు. ఉచిత ఇసుక పాలసీ పక్కాగా అమలు చేస్తూ జీవో నెంబర్ 43 అమలు చేయడంతో బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి, రాష్ట్ర ప్రగతికి బాటలు వేస్తుందన్నారు. నాణ్యమైన ఇసుక ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నది తెలుగుదేశం విధానమని, పారదర్శకత, ముందుచూపుతో ఈ పాలసీ రూపొందించడం జరిగిందని ఎమ్మెల్యే చెప్పారు. ఈ నిర్ణయంతో సామాన్యులకు భారీ ఊరట లభించిందని దీంతో తమ ప్రభుత్వాన్ని అన్ని వర్గాల ప్రజలు అభినందిస్తున్నారని పేర్కొన్నారు.ఎందుకంటే గత జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియా నడిపి కోట్లు కొల్లగొట్టిందని, వైసీపీ నేతలే ఇసుకాసుర అవతారం ఎత్తి రూ.50 వేల కోట్లకుపైగా కొల్లగొట్టారని విమర్శించారు.జగన్ ప్రభుత్వం ఇసుక కృత్రిమ కొరత సృష్టించి ప్రజలను ఇబ్బందులకు గురి చేసిందని దీంతో నిర్మాణరంగం కుదేలైందని మండిపడ్డారు. జగన్ పాలనలో పేదలు ఇల్లు కట్టుకోడానికి రూ.5 లక్షలు ఖర్చు చేస్తే అందులో ఇసుక కొనడానికే రూ.3 లక్షలు ఖర్చు పెట్టాల్సిన దుస్థితి ఉండేదని గుర్తు చేశారు.గృహ నిర్మాణ శాఖకు సరఫరాల పేరుతో 98 లక్షల టన్నుల ఇసుకను జగన్ అండ్ కో మింగేసిందని ధ్వజమెత్తారు.జగన్ బినామీ సంస్థ జేపీ వెంచర్స్ చెల్లించాల్సిన మొత్తం నుంచి రూ.800 కోట్లు మినహాయించి ప్రజాధనాన్ని ధారాదత్తం చేశారని విమర్శించారు. జిల్లా స్థాయిలో శాండ్ కమిటీలు ఏర్పాటు చేసి అధికారులు ఎక్కడికక్కడ పర్యవేక్షిస్తారన్నారు.

నిత్యావసరాల ధరలు అందుబాటులోకి తీసుకొస్తాం

కలెక్టర్ వెంకటమురళి

విశాలాంధ్ర - బాపట్ల : నిత్యావసర సరుకుల ధరలు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి చెప్పారు. రైస్, దాల్ మిల్లర్ల అసోసియేషన్ నాయకులతో జిల్లా స్థాయి కమిటీ సమావేశం మంగళవారం స్థానిక కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో జరిగింది. నిత్యావసర సరుకుల ధరల తగ్గింపుపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని జిల్లా కలెక్టర్ తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు రాష్ట్రస్థాయి మిల్లర్ల అసోసియేషన్తో సమావేశమై ధరల నియంత్రణపై చర్చించారన్నారు. అందులో భాగంగా జిల్లాస్థాయి కమిటీ సమావేశంలో ధరల తగ్గింపుపై సుదీర్ఘంగా చర్చించారు. రారైస్ ఒక కిలో ధర రూ.48లు, స్టీమ్ రైస్ ఒక కిలో రూ.49లు ధరగా నిర్ణయించి విక్రయం చాలన్నారు. కందిపప్పు ఒక కిలో రూ.160 లు ధర నిర్ణయించి విక్రయించాలన్నారు. జిల్లా అసోసియేషన్ నాయకులంతా ఏకగ్రీవంగా ఆమోదించడంతో ఈనెల 11వ తేదీ నుంచి ప్రత్యేక కౌంటర్ల ద్వారా విక్రయించనున్నట్లు ఆయన ప్రకటించారు. జిల్లా వ్యాప్తంగా బాపట్ల, చీరాల, అద్దంకి, పర్చూరు, రేపల్లె, వేమూరు ప్రాంతాలలోనూ ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేస్తామన్నారు.

లోకేష్‌ను కలిసిన ఎంపీ మాగుంట

విశాలాంధ్ర-ఒంగోలు : ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నివాసంలో ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి మరియు మంగళగిరి శాసనసభ్యులు నారా లోకేష్‌ని మర్యాదపూర్వకంగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి మంగళవారం కలిశారు. ఈ కార్యక్రమంలో ఆయనతో పాటు టిడిపి యువనేత మాగుంట రాఘవరెడ్డి, కలిసిన ఒంగోలు నరసరావుపేట పార్లమెంటు సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయులు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి నిరూపణ అయితే చర్యలు తప్పవు

శింగరాయకొండ పంచాయతీ డీపీఓ ఉషారాణి

విశాలాంధ్ర-శింగరాయకొండ : శింగరాయకొండ పంచాయి తీలో అవినీతి జరిగినట్లు రుజువు అయితే పంచాయితీ చట్ట ప్రకారం చర్యలు తప్పవని డీపీఓ ఉషారాణి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేయడానికి విచ్చేశారు. విలేకరులతో మాట్లాడుతూ జనసేన నేతలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కలెక్టర్ ఆదేశాలతో శింగరాయకొండ పంచాయితీలో అవినీతి జరిగిందని రికార్డులు పరిశీలించడానికి వచ్చానని, అయితే రికార్డుల పరిశీలనలో సర్పంచి తప్పనిసరిగా ఉండాలని ఆమె ఆధ్వర్యంలో తనిఖీ నిర్వహిం చాలని అందుకు గురువారం మరలా వస్తానని తెలిపారు. రికార్డుల్లో అవినీతి జరిగివుంటే తప్పకుండా చర్యలు తీసు కుంటామని ఆమె తెలిపారు. అధికారులైతేనేమీ పాలకులైనా ఎలాంటివారినైనా వదిలేది లేదని ఆమె పేర్కొన్నారు. అయితే శింగరాయకొండ పంచాయతీలో ఎప్పటి నుంచో రికార్డులు తారుమారు అవుతున్నాయని వాటిపై కూడా చర్యలు తీసు కుంటామని ఆమె తెలిపారు. ఈ కార్య క్రమంలో డీఎల్‌పీఓ పద్మ, ఎంపీడీఓ నగేష్‌కుమారి, ఈఓ కోటా శ్రీహరి, కనిగిరి డీఎల్‌పీఓ శోభన్‌బాబు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండలంలోని గొట్లగట్టు కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలోని బాలికలకు, గొట్లగట్టు వైద్యాధికారి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, డెంగ్యూ, మలేరియా ఫైలేరియా, చికెన్ గున్యా సీజనల్ వ్యాధుల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల ద్వారా వ్యాపించు ఐదు రకాల వ్యాధుల గురించి తెలియజేశారు. దోమలు లేకుండా దోమలు పెరగకుండా చూసు కోవాలన్నారు. దోమల నివారణకు దోమతెరలు వాడాలని, పరిసరాలు పరిశుభ్రత, భోజనానికి ముందు తరువాత చేతులను కడుకోవాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి పదార్థాలు భుజించాలని, ఆరోగ్య సూచనలు సలహాలు చేశారు. హెచ్ఈఓ నారాయణరెడ్డి, హెచ్‌వి భారతి హెల్త్ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్లు, హెల్త్ అసిస్టెంట్ రామ్ రెడ్డి, ఏఎన్ఎం ఆరిఫా ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, బాలికలు పాల్గొన్నారు.

నిర్మాణ రంగం అభివృద్ధికి ఉచిత ఇసుక హర్షణీయం

విశాలాంధ్ర-దొనకొండ: రాష్ట్రంలో భవన నిర్మాణ రంగం అభివృద్ధి జరిగి కార్మికుల సంక్షేమం కోసం సీఎం నారా చంద్రబాబునాయుడు ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తేవటం ఎంతో హర్షణీయమంటూ టీడీపీ మండల అధ్యక్షులు ఎన్.శివకోటేశ్వరరావు తెలిపారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉచితంగా ఇసుక అందిస్తున్న నీయంకు, కూటమికి మండల ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నామన్నారు. టీడీపీలో మన నాయకులే పొరపాట్లు చేస్తే ప్రశ్నించే తత్వం మన పార్టీదని, మనలో మనమే ప్రతిపక్షం, మనమే అధికార పక్షంగా ఉంటామన్నారు. మండల ప్రముఖ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, డా.మల్లికార్జునశర్మ, కొమ్మతోటి సుబ్బారావు తదితరులు మాట్లాడిన వారిలో ఉన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువులకు సూర్య శ్రీ ట్రస్ట్ ఆర్థిక సాయం

విశాలాంధ్ర-ఒంగోలు : పేర్నమిట్టకు చెందిన అబ్దుల్ గఫూర్ తల్లిదండ్రులు చనిపోయి వృద్ధురాలు నాయనమ్మ మహబూబి దగ్గర పెరుగుతున్న షేక్ అబ్దుల్ గఫూర్ సమత నగర్‌లోని సాయి కాన్వెంట్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. చదువులో మంచి ప్రతిభ చూపిస్తున్నాడు కానీ స్కూల్ ఫీజు మరియు పుస్తకాలు కొనే ఆర్థిక స్తోమత లేక సూర్య శ్రీ ట్రస్ట్ సెక్రటరీ షేక్ సర్దార్ భాష కి సంప్రదించారు స్పందించిన ఆయన ప్రవాస భారతీయుడు దాత కుర్ర అనిల్ కుమార్ తో మాట్లాడి అబ్దుల్లా స్కూల్ ఫీజు పుస్తకాల నిమిత్తం 15,000 రూపాయలు ట్రస్టు కార్యాలయం నందు ట్రస్ట్ చైర్ పర్సన్ సయ్యద్ షహనాజ్ సర్దార్ భాషా చేతుల మీదగా అందజేశారు . ఈ సందర్భంగా ట్రస్ట్ సెక్రెటరీ సర్దార్ మాట్లాడుతూ అబ్దుల్ గఫూర్ బాగా చదువుకుంటే ఉన్నత చదువులకు తప్పకుండా ట్రస్ట్ తరపున ఆర్థిక సహాయం చేస్తా అని మాట ఇచ్చారు.

వాహనాలు తనిఖీ

విశాలాంధ్ర-పీసీపల్లి : వాహనాల తనిఖీలో భాగంగా మంగళవారం మండలంలోని పెదఅలవల పాడు గ్రామంలో బైక్ లపై ముగ్గురు వ్యక్తులు డ్రైవింగ్ లైసెన్స్ హెల్మెట్లు ఎలాంటి వాహన పత్రాలు లేనివారికి ఎస్సై టి రమేష్ బాబు తన సిబ్బందితో తనిఖీలు నిర్వహించారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేని పలు వాహనాలకు అపరాధరుసుము విధించారు. అలాగే వాహనదారులకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ప్రయాణం చేసే సమయంలో వాహనానికి సంబంధించిన అనుమతి పత్రాలను ఎల్లప్పుడూ దగ్గర ఉంచుకోవాలని వాహనదారులకు తెలియజేశారు.

మంగళ, శనివారాల్లోనే ఆలయంలోకి అనుమతి

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : యర్రగొండపాలెం మండలంలోని నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న దద్దనాల ఆంజనేయ స్వామి ఆలయానికి మంగళ, శనివారాల్లో మాత్రమే అనుమతులు ఉన్నట్లు కొలుకుల సెక్షన్ ఫారెస్ట్ అధికారి మంగళవారం ప్రకటనలో తెలిపారు. శాంతినగర్ వద్ద చెక్ పోస్ట్ ఏర్పాటు చేశామని ఆయా వారాల్లో ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకే అనుమతి స్వామిని తెలిపారు. పర్యావరణ ఖర్చులు నిమిత్తం ద్విచక్ర వాహనాలకు రూ.50, ఫోర్ వీలర్ వాహనాలకు రూ.100 వసూలు చేస్తున్నట్లు తెలిపారు. భక్తులు గమనించగలరు.

ఎంఎంఆర్ ఫౌండేషన్ సేవలు అభినందనీయం

ఎంఈఓ వెంకారెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : విద్యార్థులకు, వృద్ధులకు అవసరమైన సేవలు అందిస్తూ ఎంఎంఆర్ ఫౌండేషన్ చేస్తున్న కృషి అభినంద నీయమని, ఫౌండేషన్ ప్రతినిధి థామస్ సేవా నిరతికి ఇది నిదర్శనమని సంతనూతలపాడు మండల విద్యాశాఖ అధికారి వెంకారెడ్డి పేర్కొన్నారు. పేర్నమిట్ట శాంతినగర్‌లో డాక్టర్ నూకతోటి రవికుమార్ నేతృత్వంలో నిర్వహిస్తున్న అంబేద్కర్ స్టడీ సర్కిల్ ట్యూషన్ సెంటర్లో మక్కెన, రోజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులకు మంగళవారం ఉచిత నోటు పుస్తకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డాక్టర్ రవి కుమార్ అధ్యక్షత వహించగా జరిగిన సభలో వెంకా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఫౌండేషన్ చైర్మన్ మక్కెన థామస్ మాట్లాడుతూ వృద్ధులకు వికలాంగులకు విద్యార్థులకు అవసరమైన సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ప్రమాద బారిన పడిన వారికి తక్షణం రక్తదానం చేస్తూ ఫౌండేషన్ విశేషంగా కృషి చేస్తున్నదని అన్నారు. తన తల్లిదండ్రుల పేరు మీద చేస్తున్న ఈ కృషి సార్థకం అవుతు న్నందుకు సంతోషంగా ఉందని అన్నారు.

అతిసార వ్యాధితో అప్రమత్తం

విశాలాంధ్ర-ముండ్లమూరు : 0 నుండి ఐదు సంవత్సరాలలోపు పిల్లలపై అతి సారా వ్యాధి సోకే ప్రమాదం ఉందని దానిపట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారిని ఎం జాస్మిన్ పేర్కొన్నారు. స్థానిక ఆదర్శ పాఠశాల, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం అతి సారాపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అతి సారా వ్యాధి వైరస్ వల్ల వ్యాప్తి చెందుతుందన్నారు. దోమల ప్రబలకుండా పరిసరాలను పరిశు భ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిననీటిని తాగాలన్నారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుధ్యపనులు పటిష్టంగా నిర్వహించాలన్నారు. ఐదేళ్ల లోపు పిల్లలకు ఓఆర్ఎస్ నీటిని తాగించాలన్నారు. సిహెచ్ఓ నారాయణ రావు మాట్లా డుతూ ట్యాంకులలో నీటి నిల్వలను శుభ్రపరచి క్లోరి నేషన్ చేయాల న్నారు. వైరస్ జ్వరాలపట్ల వైద్య సిబ్బంది అప్రమత్తతో వ్యవహరించాలని సూచించారు. నీటి నిల్వ ఉన్న ప్రాంతాలలో దోమ, లార్వా జరగకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో వి.కన్యాకుమారి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ కే పూర్ణచంద్రరావు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్చార్జి ప్రధానో పాధ్యాయుడు ఎస్ కే హజరత్ అలీ పాల్గొన్నారు.

ఉచిత ఇసుకపై సమావేశం



విశాలాంధ్ర-కురిచేడు : తెలుగుదేశం పార్టీ జనసేన పార్టీ బీజేపి పార్టీ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉచిత ఇసుక ప్రవేశపెట్టిన తీరును హర్షిస్తూ స్థానిక తెలుగుదేశం మండల పార్టీ కార్యాలయంలో మంగళ వారం తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు పిడతల నేమలయ్య అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాజీ మండల అధ్యక్షులు కాట్రాజు నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక ధరలు చుక్కలు ఉంటాయని అందువలన భవన నిర్మాణ కూలీలు వలసలు వెళ్ళవలసి వచ్చిందని ప్రస్తుతము చంద్రబాబు ఎన్నికల సమయంలో చెప్పిన ప్రకారము ఇచ్చిన హామీ ప్రకారము ఇసుకను నేడు ప్రవేశపెట్టడం జరిగింది. ఈ విధానం వల్ల గృహములు కట్టించుకునేవారు బేలుదారులు అందరికీ పనులు చేతినిండా ఉంటాయని ఈ సందర్భంగా వారు గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మొగల్ మస్తాన్వలి క్రమతమ నాగిరెడ్డి మాజీ సర్పంచ్ మీరు ఎలిశెట్టి శ్రీనివాసరావు మరి సుబ్బారావు నబీ మస్తాన్ కిలారు పెదకొండయ్య కేసనపల్లి శివయ్య నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

యర్రగొండపాలెం అభివృద్ధికి సహకరించండి

ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్‌ను కోరిన ఎరిక్షన్ బాబు

విశాలాంధ్ర-యర్రగొండపాలెం : అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న యర్రగొండపాలెం నియోజకవర్గ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని మంగళవారం అమరావతి సచివాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి వర్యులు పయ్యావుల కేశవ్‌ను యర్రగొండపాలెం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ గూడూరి ఎరిక్షన్ బాబు, ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు కోరారు. ఎరిక్షన్ బాబు మాట్లాడుతూ యర్రగొండపాలెం నియోజక వర్గం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని, వైసీపీ ప్రభుత్వంలో ఉన్న నాయకులు నియోజకవర్గంను పట్టించుకోలేదని, యర్రగొండపాలెం నియోజకవర్గాన్ని టీడీపీ ప్రభుత్వంలో అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని అందుకోసం యర్రగొండపాలెం నియోజకవర్గం అభివృద్ధి కొరకు ఎక్కువ నిధులు మంజూరు చేసి ఆదుకోవాలని కోరారు. ఎరిక్షన్ బాబు వినతిని మంత్రి కేశవ్ సానుకూలంగా స్పందించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువుల దుకాణాల్లో విజిలెన్స్ అధికారుల తనిఖీలు

ఐదు షాపుల్లో విత్తనాలు అమ్మకాలు నిలుపుదల

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం పట్టణంలోని ఐదు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల షాపుల్లో తనిఖీలు నిర్వహించి విత్తనాల అమ్మకాలను నిలుపుదల చేయాలని ఆదేశించినట్లు మార్కాపురం ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. నకిలీ విత్తనాలు, ఎరువులు అమ్మిన వ్యాపారులపై కేసులు నమోదుచేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం పట్టణంలోని పలు విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల అమ్మేషాపులపై విజిలెన్స్ అధికారులు తనిఖీ నిర్వహించారు. ఇతర జిల్లాల్లో విత్తనాలు, పురుగు మందులు అమ్మరాదని, అలా అమ్మాలనుకుంటే లైసెన్సులు కలిగివుండాలని తెలిపారు. పురుగుమందుల దుకాణాల యజమానులు ఎప్పటికప్పుడు వారి వద్ద ఉన్న ఎరువులు విత్తనాల వివరాలను దరలు చూపించే, స్టాక్ బోర్డు నిర్వహణ సక్రమంగా ఉంచాలని అన్నారు. ప్రతి అమ్మకానికి కొనుగోలుచేసే రైతుకు రసీదులు ఇవ్వాలని అన్నారు. ఈ తనిఖీల్లో ఒంగోలు టెక్నికల్ ఏఓ శ్రీనివాసనాయక్, మార్కాపురం, తర్లుపాడు ఏఓ దేవిరెడ్డి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక పురుగు మందులు లేని వ్యవసాయ పద్ధతులు పాటించాలి

వ్యవసాయ అధికారి ఫారుక్

విశాలాంధ్ర-ముండ్లమూరు : రైతులు రసాయనికఎరువులు, పురుగు మందు లను నిషేధించి సుస్థిర వ్యవసాయ పద్ధతులు పాటించాలని మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ ఫరూక్ అన్నారు. మండలంలోని ఈదర గ్రామంలో మంగళవారం పెరటి తోటల పెంపకం పై ఎస్సీ రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డిబి ఆర్సి రీజనల్ కోఆర్డినేటర్ దార్ల కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగినది. ఏవో మాట్లాడుతూ రసాయనకమందులు వాడకుండా పండించిన కూరగాయలు వినియోగించు కోవాలని ఆయన తెలిపారు. సుస్థిర వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలు పండించుకుని మంచి ఆరోగ్యంగా జీవించాలని ఆయన రైతులకు తెలియజేశారు. కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన పంటల శాస్త్రవేత్త ఎం శివ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ ఇంటి ఆవరణలో పెరటి తోటలో పెంచుకోవాలన్నారు.

వసతి గృహాలు నూరుశాతం విద్యార్థులతో నిండాలి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ప్రభుత్వ సాంఘిక సంక్షేమ వసతి గృహాలలో వందకు వంద శాతం మంది విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలని సాంఘిక సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎన్ లక్ష్మా నాయక్ సూచించారు. స్థానిక సహాయ సాంఘిక సంక్షేమ శాఖధికారి కార్యాలయంలో ఏఎస్ డబ్ల్యూఓ ఈ రాజేశ్వరమ్మ ఆధ్వర్యంలో మంగళవారం గిద్దలూరు, బేస్తవారిపేట పరిధిలోని వసతి గృహ సాంఘిక సంక్షేమాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ 3నుండి పీజీ వరకు దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థికి వసతి గృహాలలో వసతి కల్పించాలన్నారు. మెనూ తప్పనిసరిగా పాటించాలని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి విద్యార్థి వారి పాఠశాలకు తప్పనిసరిగా హాజరయ్యేలా తగు చర్యలు తీసుకుంటూ, తరచూ పాఠశాల ప్రధానోపాధ్యాయులను సంప్రదించి చదువులో వారి నైపుణ్యతను తెలుసుకుంటూ, మెరుగైన విద్యనందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వసతి గృహంలో ప్రతి నెల హాస్టల్ అడ్వైజరీ కమిటీ మీటింగ్, మూడు నెలలకోసారి పేరెంట్స్ కమిటీ మీటింగ్ లను నిర్వహించాలని సూచించారు. వసతిగృహాల పరిసరాలు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, పదవ తరగతిలో నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలని ఆయన కోరారు. వసతిగృహాల సంక్షేమధికారులు, నాల్గవ తరగతి సిబ్బంది తప్పనిసరిగా హెడ్ క్వార్టర్స్ లోనే నివాసవ ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో గిద్దలూరు సహాయ సాంఘిక సంక్షేమాధికారి ఎన్ అమ్మజీ, సాంఘిక సంక్షేమధికారులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక పాలసీ అభినందనీయం

విశాలాంధ్ర-సంతనూతలపాడు : ఏపీ ప్రభుత్వం ఇసుక పాలసీని తీసుకురావటం అభినందనీయమని టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడకా స్వాములు టిడిపి మండల పార్టీ అధ్యక్షులు మద్దినేని హరిబాబు అన్నారు. స్థానిక మండల టిడిపి కార్యాలయంలో మంగళవారం కార్యకర్తలతో జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉచిత ఇసుక విధానం వల్ల సామాన్యులకు భారీ ఊరట లభించిందని, ఎన్నికలలో ఇచ్చిన హామీని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చిన నెలలో అమలులోకి తెచ్చారని అన్నారు. శాండ్ అమలు చేస్తూ జీవో నెంబర్ 43 విడుదల చేయటం బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రగతికి బాటలు వస్తుందని తెలిపారు. గత మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం ఇసుక మాఫియా నడిపిందని ఒక ఇసుక కుంభకోణం ద్వారా 50 వేల కోట్లకు పైగా వైసిపి నేతలే ఇసుకసురాలో అవతారం ఎత్తి దోచుకున్నారని అన్నారు. పేదల ఇల్లు కట్టుకోవడానికి రూ 5 లక్షల అయితే3 లక్షల ఖర్చు ఇసుక అయిందని తెలిపారు. గృహ నిర్మాణ శాఖ పేరుతో 98 లక్షలు టన్నుల ఇసుక ను జగన్ అండ్ కో మింగేసి మినయంపు ప్రజాధనాన్ని ధారా దత్తం చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు నిరోధిస్తూ రాష్ట్ర ప్రజల ప్రగతే ధ్యేయంగా ఈ పాలసీని రూపొందించారు. దీనిపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుంది అన్నారు. తెలుగు యువత అధ్యక్షులు ముప్పరాజు శ్రీనివాసరావు టిఎన్ఎస్ఎఫ్ అధ్యక్షులు మందాడి వెంకటేశ్వర్లు టిడిపి నాయకులు మార్పుడి జనార్ధన్ చెరుకూరి బోసు చెరుకూరి సుబ్బారావు నల్లగట్ల సుబ్బారావు మందాడి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పీజీ ఫలితాల్లో శ్రీహర్షిణి విద్యార్థికి యూనివర్సిటీ ఫస్ట్

విశాలాంధ్ర-ఒంగోలు : ఫిబ్రవరి 2024 ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం నిర్వహించిన పీజీ మొదటి సెమిస్టర్ ఫలితాలు సోమవారం విడుదల చేయడం జరిగినది. అందులో శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ విద్యార్థులు యూనివర్సిటీ మొదటి ర్యాంక్ సాధించి విజయ దుందుభి మోగించారు. అందులో ఎం ఎస్ సి కంప్యూటర్ సైన్స్ 70 మంది విద్యార్థులు హాజరుకాగా 64 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినారు. అందులో కటారి యామిని 700 మార్కులకు గాను 634 మార్కులు సాధించి యూనివర్సిటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. వీ హర్షిత 628 మార్కులతో రెండవ స్థానాన్ని, కే గౌతమి 621 మార్కులతో తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారు.ఎమ్ ఎస్ సి కెమిస్ట్రీలో 56 మంది విద్యార్థులు హాజరుకాగా 50 మంది ఉత్తీర్ణత సాధించినారు. అందులో చెరుకూరి మహిత 650 మార్కులకు గాను 566 మార్కులతో యూనివర్సిటీ మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. జి భావన 552 మార్కులతో రెండవ స్థానాన్ని, కే హేమ 546 మార్కులతో తృతీయ స్థానాన్ని సాధించారు. ఎం ఎస్ సి మ్యాథమెటిక్స్ 38 మంది విద్యార్థులు హాజరుకాగా 30 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినారు. అందులో గుండ్రెడ్డి స్వప్న 600 మార్కులకు గాను 483 మార్కులతో యూనివర్సిటీ ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు .రెండవ స్థానాన్ని జి పుష్పలత 480 మార్కులతో, మూడవ స్థానాన్ని టీ సంపత్ కుమార్ 472 మార్కులతో కైవసం చేసుకున్నారు. ఎమ్ఎస్సి ఫిజిక్స్‌లో యూనివర్సిటీ స్థాయిలో కేవలం ముగ్గురు విద్యార్థులు మాత్రమే ఉత్తీర్ణత సాధించగా అందులో ఇద్దరు విద్యార్థులు శ్రీహర్షిణి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ వారు కావడం గర్వకారణం.

నిరంతర విద్యుత్ సరఫరా ప్రారంభం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండల కేంద్రానికి 24 గంటలు విద్యుత్ సరఫరాను మంగళవారం విద్యుత్ అధికారి ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ ఏఈ ఎస్ వీరబ్రహ్మం మాట్లాడుతూ మండల కేంద్రాలకు 24 గంటలు విద్యుత్తు ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యేక నూతన లైన్ ఏర్పాటు చేసి ఆ సౌకర్యాన్ని కల్పించామని ఆయన అన్నారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు తెలిపారు. ఊరికి దూరంగా ఉన్న ఎస్టీ కాలనీకి నూతన విద్యుత్ సరఫరా అందించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ ఎస్ సాంబయ్య, లైన్ మాన్ ఎస్.కె మాసూం మస్తాన్, పి ఆంజనేయులు, సిహెచ్ కోటేశ్వరరావు, నారాయణ, హరికృష్ణ పాల్గొన్నారు.

నోటీసు

U/o 21, Rule 22, of CPC
IN THE COURT OF THE 7th ADDITIONAL DISTRICT JUDGE, ONGOLE
E.P.No.432/2023, A.O.P.No: 1146/2012
Between:
M/s. Shreeram Transport Finance Co. Ltd., Kanigiri, Represented by its Authorized Signatory Kumbha Srinivasa Rao - DHR
And
1. Mule Prasad Reddy @ Mule Prasad
2. Rasam Chenakesavulu (Not Claimed) - J.D.Rs.
J.D.R.-1 Address : Mule Prasad Reddy @ Mule Prasad, S/o. Venkata Ratnam, Hindu, Cultivation, Aged about 41 Years, H.No.4-11A, Marella Village, Peda Cherlopalli Mandal, Prakasam District, Pincode - 523117.

పై ఇ.పి.ని డిహెచ్ఆర్, జె.డి.ఆర్.-1, అయిన మీపై తన అవార్డు బాకీ రాబట్టు కొనుటకుగాను దాఖలు చేసియున్నారు. సదరు ఇ.పి.పై కోర్టునందు నిల్వలో ఉండి మీకు అనేక పర్యాయములు **రూలు 22** నోటీసులను పంపినను వాటిని మీరు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నందున శ్రీకోర్టువారు మీకు ఈ పత్రికా ముఖంగా నోటీసుకై ఉత్తర్వులు జారీ చేసియున్నారు. కావున మీరు **ది. 28-8-2024న ఉదయం 10.30గం॥లకు** పై కోర్టువారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియచేయగలరు. లేనియెడల మీ పరోక్షముగా శ్రీ కోర్టువారు తీర్మానించెదరని మీకు తెలియ చేయడమైనది.
(శ్రీ కోర్టువారి ఆదేశానుసారం మేరకు)

వేమరాజు శ్రీనివాసరావు,
డి.హెచ్.ఆర్. తరపు న్యాయవాది, ఒంగోలు.
ఒంగోలు, తేది : 8-7-2024

మహానేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి

కనిగిరి వైసీపీ ఇన్చార్జ్ దద్దాల

విశాలాంధ్ర-పామూరు : పేద ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి అని వైసిపి కనిగిరి ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ అన్నారు. డాక్టర్ వైయస్ రాజశేఖర్‌రెడ్డి 75వ జయంతి వేడుకలను పురస్కరించుకొని మండలంలోని లక్ష్మీనరసాపురం పంచాయతీ పరిధిలోని రేగిచెట్లపల్లి గ్రామంలో తవ్వ సాగర్ రెడ్డి, సంధ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రాజశేఖర్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. నారాయణ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన మహా నేత వైయస్ రాజశేఖర్‌రెడ్డి అని అన్నారు. రాజశేఖర్ రెడ్డి ఆశయాలు జగనన్నతోనే సాధ్యమన్నారు. సందర్భంగా 50 మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. 25 కేజీల భారీ కేక్‌ను కట్ చేసి పంచిపెట్టారు. మండల కేంద్రమైన పామూరులో ఎంపీపీ గంగసాని లక్ష్మి హుస్సేన్ రెడ్డి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలాలతో ఘన నివాళులర్పించారు. అనంతరం వైసిపి మండల కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో రాజశేఖర్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ కు చేసిన సేవలు ను కొనియాడారు. కార్యక్రమంలో జడ్పిటిసి చప్పిడి సుబ్బయ్య, ఏఎంసి వైస్ చైర్మన్ షేక్ చాంద్ బాషా, గట్ల విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి, జొన్నలగడ్డ గోవిందయ్య మాలకొండ రెడ్డి ,ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకటరత్నం, సర్పంచి సైకం వెంకటేశ్వర్ రెడ్డి, రేగులపల్లి గ్రామ ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

మీ సేవలో ఈసీలు, నకళ్లు రాకపోవటంతో ప్రజల అవస్థలు

విశాలాంధ్ర-కంభం : ఎలక్షన్ కోడ్ ముందు మీ సేవ కేంద్రాలలో ఈసీలు నకలు సర్వీసులు నిలిపివేయడం జరిగింది. నేటికి సర్వీసులు పునరుద్దరించక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లోన్ కోసం రిజిస్ట్రేషన్ల కోసం అవసరమైనప్పుడు మీ సేవలో సర్వీసులు లేక రిజిస్ట్రేషన్ కార్యాలయంలో వెంటనే రాక ఇబ్బందులు పడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కానీ, సంబంధిత అధికారులు కానీ, స్పందించి సర్వీసులను పునరుద్దించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

ఉచిత ఇసుక విధానం అమలు హర్షణీయం

సీపీఐ మండల కార్యదర్శి గురునాథం

విశాలాంధ్ర-పుల్లలచెరువు : రాష్ట్ర ప్రభుత్వం పాత ఇసుక విధానాన్ని రద్దు చేస్తూ ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేయడం హర్షణీయమని సిపిఐ మండల కార్యదర్శి జి.వి.గురునాథం అన్నారు. బుధవారం గురునాథం విలేకరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక అందుబాటులో ఉండేది కాదని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో పేదవాడు ఉచిత ఇసుక విధానంతో పేదలు ఇల్లు కట్టుకోవడానికి ఇసుక ఇక్కట్లు తప్పాయని అన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ చైర్మన్‌గా కమిటీని ఏర్పాటు చేసి, ఆకమిటీలో ఏఐటియుసి, భవన నిర్మాణ కార్మిక నాయకులకు కమిటీలో స్థానం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ విధానం ద్వారా భవన నిర్మాణ కార్మికులు పడే ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే అవకాశం ఉంటుందని తెలిపారు.

మోపాడు రిజర్వాయర్‌కు ఆధునికీకరణ పనులు

విశాలాంధ్ర-పామూరు : ఎన్నో ఏళ్ల నుంచి మోపాడు రిజర్వాయర్ మరమ్మత్తులకు నోచుకోక తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. మండలంలోని మోపాడు రిజర్వాయర్ ఆధునికీకరణ పనుల కోసం జైకా నిధులు 34కోట్లు మంజూరు అయ్యాయి. కాలువల సిమెంట్ రివిట్ మెంట్, లీకేజి, రోడ్డు నిర్మాణం, గండ్లు పూడ్చడం లాంటి పనులు చేపట్టాలి. 2021లో రిజర్వాయర్ కట్టకు 12చోట్ల లికేజీలు ఏర్పాడాయి. లీకేజి పూడ్చడానికి సుమారు వారం రోజులపాటు సహాయక చర్యలు చేపట్టారు. అయినా కూడా పూర్తిస్థాయిలో లీకేజి అరికట్టలేకపోయారు. అయితే ఇలాంటి పరిస్థితిలు మరోసారి తలెత్తకుండా ఉండాలంటే కట్ట పై భాగంతో పాటు చెరువు లోపలి భాగం లో చిల్ల చెట్లు తొలగింపు, కట్ట వెడల్పు చేయడం, పూడిక తీత పనులు చేపట్టాలని 4రోజులు క్రితం మోపాడు ప్రాజెక్ట్ సందర్శనకు వచ్చిన కనిగిరి ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వంలో చేపలు బయటకు పోకుండా అడ్డుగా వలలు ఏర్పాటుకు అవసరం లేకపోయినా బ్రిటిష్ వారు నిర్మించిన అలుగును ధ్వంసం చేశారు. యధాస్థితిగా తిరిగి అలుగును నిర్మించాలని ఆయకట్టు రైతులు ఉగ్రనరసింహారెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుతం చెరువులో కలుషితంగా మారిన నీటిని బయటకు వదిలి తూము గేటు మరమ్మత్తులు చేపట్టి చెట్లను తొలగించాలి. అలాగే కట్టను వెడల్పు చేసి 100 సంవత్సరాల చరిత్రను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. ఈ ఏడాది ఆధునికరణ పనులు సకాలంలో జరిగేలా చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ అధికారులను ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. దీంతో సోమవారం రిజర్వాయర్ ఆధునికీకరణ పనులు ప్రారంభించారు.

డయేరియా, డెంగీ వ్యాధులను తరిమేద్దాం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని పెద్ద బొమ్మలపురము గ్రామము నందు చింతల ప్రాధమిక ఆరోగ్య కేంద్రము వైద్యాధికారి డాక్టర్ యం.యాగ్నిక్ ఆధ్వర్యంలో డయేరియా మరియు డెంగీ మసోత్సవం కార్యక్రమంను మంగళవారం నిర్వహించారు. గ్రామములోని ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు అవగాహన కార్య క్రమము నిర్వహించి తదుపరి గ్రామము నందు ర్యాలీ నిర్వహించటం జరిగినది. వైద్యాధికారి ఎం యాగ్నిక్ మాట్లాడుతూ గ్రామ ప్రజలు వాతావరణంలో మార్పు వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, డయేరియా సోకకుండా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని,పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి అని, నిలువ ఉన్న ఆహార పదార్థాలను తినరాదు అని,చేతులు పరిశుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. మలేరియా సూపర్ వైసర్ కే. ఇజ్రాయెల్ మాట్లాడుతూ దోమల వలన 5 రకాల వ్యాధులు సంభవిస్త యని కావున దోమలు పుట్టకుండా కుట్ట కుండ చూసుకోవాలని, ఇంటి పరిసాలలో నీరు నిలువ లేకుండా చూసుకోవాలని, దోమ తెరలు వాడాలని నీరు నిలువ ఉన్న ప్రాంతాలలో మడ్డి ఆయిల్ గానీ ఎబెట్ గానీ చల్లాలి అని తెలియ జేశారు. 0 నుండి 5 సంవత్సారాలు లోపు తల్లులు అప్రమత్తంగా ఉండాలని డయేరియా సోకకుండా అప్రమత్తంగా ఉండాలని పి.హెచ్. యన్,సూపర్ వైయస్ఆర్‌లు తెలియజేశారు. పి. హెచ్. యన్, పి.సూర్యకుమారి, సబ్ యూనిట్ ఆఫీసర్ సి. హెచ్.రమేష్ బాబు, సూపర్ వైసర్లు కె.సత్యనారాయణ రెడ్డి, కె.పద్మావతి ఎ.యన్.యం,యస్. డి భాను,సి. హెచ్. ఓ మీరా వలి, హెల్త్ అసిస్టెంట్ ఏ.భరత్ భూషణ్, 104 సిబ్బంది చాంద్ భాష,ఆశా కార్యకర్తలు ఎ.కాశీ ఈశ్వరి,యం. లక్ష్మీ దేవి, డి. కాశమ్మ,యం. పవిత్ర,హుసేన్‌బీలు పాల్గొన్నారు.

ఎన్డీయే కూటమి విజయంతో పాదయాత్ర

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి భారీ విజయం సాధించడంతో కడప జిల్లా రైల్వే కోడూరు ఎమ్మెల్యే అరవ శ్రీధర్ మంగళవారం శ్రీశైలంకు పాదయాత్రతో బయలుదేరారు. దోర్నాల మండల జనసేన నాయకులు రైల్వే కోడూరు ఎమ్మెల్యే శ్రీధర్‌కు ముందుగా ఘన స్వాగతం పలికారు. గణపతి చెక్‌పోస్ట్ వద్ద మండల టిడిపి నాయకులు జనసేన నాయకులు, స్థానిక విఘ్నేశ్వర స్వామికి ముందుగా పూజ నిర్వహించి అనంతరం పాదయాత్రగా శ్రీశైలం బయలుదేరి వెళ్లారు. ఇతనికి మద్దతుగా దోర్నాల మండల టిడిపి నాయకులు జనసేన నాయకులు, సంఘీభావం తెలిపారు. ఆంధ్ర రాష్ట్రంలో కూటమి అత్యధిక మెజార్టీ రావడంతో తన మొక్కులు తీర్చుకునేందుకు శ్రీశైలం వెళ్లారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల కన్వీనర్ కే.మురళి, టిడిపి నాయకులు బట్టు సుధాకర్ రెడ్డి, కొప్పుల వెంకట సుబ్బారెడ్డి, చంటి, రావికింది సుబ్బరత్నం, చెన్నరెడ్డి, కడిభట్ల శ్రీనివాస యాదవ్, జనసేన నాయకులు యమాదశయ్య, ప్రసాద్,పండు, మల్లికార్జున ఆచారి,టీడీపీ నాయకులు, జనసేన నాయకుల పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలి

ఎస్ఎఫ్ఐ గిద్దలూరు ఏరియా కమిటీ

విశాలాంధ్ర-కొమరోలు : భారత విద్యార్థి ఫెడరేషన్ గిద్దలూరు ఏరియా కమిటీ సమావేశం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయం నందు మంగళవారం జరిగింది. ఎస్ఎఫ్ఐ గిద్దలూరు ఏరియా కమిటీ అధ్యక్షులు డి తేజ మాట్లాడుతూ కొమరోలు మండలం నల్లగుంట్ల గ్రామంలో ఎయిడెడ్ ఉన్నత పాఠశాల గత బ్రిటీష్ కాలం నుండి మేనేజ్మెంట్ పరిధిలో పాఠశాల నడుపబడుచున్నది. కాలక్రమమైన పాఠశాల యాజమాన్యం పాఠశాలకు తగినంత ప్రాధాన్యత ఇవ్వకపోవడం వలన మౌలిక సదుపాయాలు కల్పించక శిథిలావస్థకు చేరుకున్నది. స్కూల్లో తగినంతగా సౌకర్యం లేకపోవడంతో పిల్లలు పాఠశాలకు వెళ్ళటం లేదని పిల్లల తల్లిదండ్రులు చెప్పున్నారు. గ్రామంలో పాఠశాల లేనందువలన కొంతమంది పిల్లలు మండల కేంద్రమైన కొమరోలుకు కొంతమంది తాటిచెర్ల మోటు వెళ్లి చదువు కొనసాగిస్తున్నారు. అయితే ఈ గ్రామం పూర్తిగా వ్యవసాయం మీద ఆధారపడి జీవనం కొనసాగిస్తున్న గ్రామం. ఈ గ్రామంలోని ప్రజలు ప్రైవేటు స్కూళ్లకు అధిక ఫీజులు చెల్లించి వారి పిల్లలను చదివించుకుంటున్నారని అదే గ్రామంలో స్కూలు ప్రారంభమవుతే తమ పిల్లలని అధిక ఫీజు చెల్లించకుండా ఉచిత చదువు చెప్పించుకునే వాళ్లు. నల్లగుంట్ల గ్రామంలో దాదాపు 500 కుటుంబాలు ఉన్నాయని వారి పిల్లలు చదువుకోవాలంటే ప్రభుత్వ పాఠశాలను ప్రారంభించాలని అన్నారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అరుణ్, శశి, సుభాష్, శ్రీను, సాయి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

బడిబయట పిల్లలను బడుల్లో చేర్పించాలి

విశాలాంధ్ర-అద్దంకి : బడిబయట ఉన్న పిల్లలను బడులలో చేర్పించాలని సిఆర్‌ఎంటి రమేష్ విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని కొటికలపూడి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను రమేష్ సందర్శించారు.పేరెంట్స్ కమిటీ చైర్మన్ అశోక్,ఉపాధ్యాయుల సహకారంతో విద్యార్థుల యొక్క గృహాలను సందర్శించి బడిబయట ఉంటున్న 8మంది విద్యార్థులను పాఠశాలలో చేర్పించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ 14సంవత్సరాల వయసు వరకు ఉన్న ప్రతి బాల,బాలికలు అందరూ బడిబయట ఉండకుండా పాఠశాలలోనే ఉండాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచించారు.డయేరియా నిర్మూలనా కార్యక్రమంలో భాగంగా చేతుల పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వెంకట్రావు,విద్యార్థులు,విద్యార్థులతల్లిదండ్రులు,పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వినియోగదారుల చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర-అద్దంకి: స్థానిక కెఆర్‌కె డిగ్రీ కళాశాలలోని వృక్షశాస్త్ర,రసాయనశాస్త్ర,వాణిజ్యశాస్త్ర విభాగాల విద్యార్థులకు మంగళవారం జీవనసాఫల్య నైపుణ్యాలను అలవర్చు నేపథ్యంలో సబ్బులు,షాంపులు సేంద్రీయ పద్ధతుల్లో తక్కువ ఖర్చుతో సులభతరంగా తయారుచేయు పద్ధతులపై ప్రయోగాత్మకంగా అధ్యాపకులు శిక్షణ ఇచ్చారు.వినియోగదారుల చట్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కళాశాల ప్రిన్సిపాల్ వి. మోహనరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కళాశాల రసాయనశాస్త్ర అధ్యాపకులు హేమలత,వృక్షశాస్త్ర అధ్యాపకులు రాజశేఖర్‌లు శిక్షణ ఇచ్చారు.

శరవేగంగా అభివృద్ధి పనులు

విశాలాంధ్ర-అద్దంకి : పట్టణంలోని 19వ వార్డులో ఉన్న వీరరాఘవస్వామి మాన్యం స్థలంలో నివాసాలు ఉంటున్న పేదల కాలనీకి వార్డు కౌన్సిలర్ యేజెండ్ల నాగరాజు ఆధ్వర్యంలో శరవేగంగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. కాలనీలో ఎన్నో ఏళ్ళుగా పరిష్కారానికి నోచుకోని విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు సంబంధించి స్థానిక ఎమ్మెల్యే విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశాల మేరకు విద్యుత్‌శాఖ అధికారులు మంగళవారం కాలనీలో నూతన విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. కాలనీలో రోడ్లు,డ్రైనేజీ తదితర మౌలిక సదుపాయాలను మంత్రి ద్వారా త్వరలో కల్పించనున్నట్లు వార్డు కౌన్సిలర్ తెలిపారు.

14న రేపల్లెలో ఉచిత వైద్య శిబిరం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె శ్రీసత్య సాయి సేవ సమితి,కేర్ యోగ న్యాచురోపతి ఆయుర్వేద హోమియోపతి హాస్పటల్ పిట్టలవానిపాలెం వారి ఆధ్వర్యంలో ఈనెల 14వ తేదీ ఉదయం 8 గంటల నుండి 1గంట వరకు రేపల్లె పట్టణంలోని ఉప్పుడి రోడ్డులో టిడిపి ఆఫీసు ఎదురుగా గల శ్రీ సత్యసాయి మందిరములో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడుతుందని శ్రీ సత్యసాయి సేవా సమితి నిర్వాహకులు తెలిపారు.వైద్యులు రోగులను పరీక్షించి వారికి హోమియో ఆయుర్వేదం,యోగ నాచురోపతి మందులు అందజేయబడతాయని కావున రేపల్లె పరిసర ప్రాంత ప్రజలు ఈ ఉచిత వైద్య శిబిరం సద్వినియోగం చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు కోరారు.

దత్తక్షేత్రం కాలనీలో ఆర్డీవో విచారణ

- ఖాళీ స్థలాలను పరిశీలించిన ఆర్డీవో
- ఆక్రమణలపై వీఆర్వోలను నిలదీత
- ఆక్రమణదారులకు నోటీసులు జారీకి ఆదేశాలు

విశాలాంధ్ర - వేటపాలెం : మండల పరిధిలోని చల్లారెడ్డిపాలెం పంచాయతీ దత్తక్షేత్రం కాలనీలో ఖాళీ స్థలాల ఆక్రమణలపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రం దత్తక్షేత్ర కాలనీలో చీరాల ఆర్డీవో జి.సూర్యనారాయణ రెడ్డి,వేటపాలెం తహసీల్దారు కృష్ణ కాంత్,జిల్లా సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి ముసలయ్యలు లేఔట్ ఖాళీ స్థలాలను పరిశీలించారు.రోడ్డు మార్జిన్,ఖాళీ స్థలాలలో ఉన్న నిర్మాణాలను పరిశీలించి సదరు నిర్మాణాలకు రెవెన్యూ రికార్డుల గురించి వి.ఆర్.ఓలను నిలదీశారు. తానాకాలనీ కొత్తపాలెం రహదారి ఆక్రమణకు గురైనట్టు గుర్తించారు. కాలనీలో సామాజిక అవసరాల కోసం రోడ్డు మార్జిన్ వద్ద వదిలివేసిన ఖాళీ స్థలాలకు రెవెన్యూ రికార్డుల ప్రకారం ఏ విధమైన పొజిషన్‌లు ఉన్నది తక్షణమే నివేదిక ఇవ్వాలని,గతంలో రిటైర్డ్ అయిన తహసీల్దార్లు ఏ ప్రొవిజన్ ప్రకారం స్థలాలను కేటాయించారనే విషయమై పూర్తి నివేదిక ఇవ్వాలని తహసీల్దార్‌ను ఆదేశించారు.అనంతరం రొంపేరు కరకట్ట వద్ద ఆక్రమణకు గురైన భూములను పరిశీలించి సదరు భూముల తాలూకు పూర్తి సమాచారం ఇవ్వాలన్నారు.భూముల పరిశీలన చేస్తున్న సమయంలో స్థానిక మహిళలు ఇంటి స్థలాలు లేక చాలా ఇబ్బంది పడుతున్నామంటూ,ఖాళీగా ఉన్న స్థలాల్లో ఇంటి స్థలం కేటాయిస్తే మా కుటుంబాలు బాగుపడతాయని ఆర్డీఓ అభ్యర్థించారు. విచారణ పూర్తయిన తర్వాత ఇంటి స్థలం లేని వారికి కచ్చితంగా ఇంటి స్థలం కేటాయించేందుకు కృషి చేస్తామని ఆర్.డి.ఓ.అన్నారు.కాలనీలో ఖాళీ స్థలాలలో ఆక్రమణలను తొలగించి పిల్లలకు ఆట స్థలం స్థానికులకు కమ్యూనిటీ హాల్ కొరకు స్థలం కేటాయించాలని జర్నలిస్టు నాగార్జున ఆర్డీఓను కోరారు.విచారణలో అధికారుల వెంట ఫిర్యాదుదారుడు ఎన్.నాగార్జున మండల సర్వేయర్లు వీఆర్వోలు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషక విలువలపై ప్రతి తల్లికి అవగాహన

- సీడీపీవో ఏ.కృష్ణకుమారి

విశాలాంధ్ర - కొరిశపాడు : మండలంలోని పమిడిపాడు గ్రామంలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రతి తల్లి కోసం ఒక చెట్టు నాటడం పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది.మూడు మండలాల పరిధిలో ఉన్న ప్రతి గ్రామంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించాలని కోరారు.గ్రామంలోని ఇంటి ఆవరణలో సామాజిక ప్రదేశాలలో మొక్కలను నాటాలని తెలిపారు.పోషక విలువలతో కూడిన సీతాఫలం,ఉసిరి, నిమ్మ,కమల, బత్తాయి,దానిమ్మ పండ్ల చెట్లు నాటుతూ ఆరోగ్యకరమైన సమాజం ఏర్పడాలంటే ప్రతి తల్లి ఇలాంటి పోషక విలువలతో కూడిన పండ్లను ఆకుకూరలను ఆహారంగా తీసుకొని ఆరోగ్యకరమైన బిడ్డలను సమాజానికి అందించాలని సిడిపిఓ ఏ.కృష్ణకుమారి అన్నారు.ఈ కార్యక్రమంలో సెక్టార్ సూపర్ వైజర్ కె.ఇందిర అంగన్వాడి వర్కర్లు,ఆశ వర్కర్లు,ఆరోగ్యశాఖ సహాయకులు,గర్భిణీ స్త్రీలు, బాలింతలు,గ్రామస్తులు పాల్గొన్నారు.

వాహనదారుడికి హెల్మెట్ తప్పనిసరి

విశాలాంధ్ర - రేపల్లె : పట్టణంలోని ఐటిఐ శారద కాలేజీలో మంగళవారం విద్యార్థులకు హెల్మెట్ వినియోగం గురించి దానివలన కలిగే ప్రయోజనాలు ధరించకపోతే కలిగే అనర్థాలు గురించి విద్యార్థులకు అవగాహన కార్యక్రమం రేపల్లె మండల న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది.హెల్మెట్ తప్పనిసరిగా ప్రతి ఒక్కరు ధరించాలని హెల్మెట్ ఉంటే ప్రమాదాలను నివారించవచ్చునని లేనియెడల ప్రమాదం జరిగినప్పుడు మృత్యు వాతకు గురికావాల్సి వస్తుందని విద్యార్థులకు వివరించారు.హెల్మెట్ ధరించని యెడల గతంలో రూ.100 పోలీసులకు జరిమానా చెల్లించవలసి ఉండేది,ఇటీవల మారిన కొత్త చట్టాల ప్రకారం రూ.1000 జరిమానా చెల్లించవలసి ఉంటుందని,అంతేకాకుండా మూడు నెలలు వరకు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని, విద్యార్థులకు క్షుణ్ణంగా వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో పారా లీగల్ వాలంటీర్లు రాచబత్తుల శ్రీనివాసరావు,చెన్ను నాగమల్లేశ్వరరావు గౌడ్,ఎస్సీ, ఎస్టీ,బీసీ మైనార్టీ సమైక్య రేపల్లె మండల కన్వీనర్ కలిచేటి శ్రీనివాసరావు,శారద ఐటిఐ కాలేజీ ప్రిన్సిపాల్ బడుగు వెంకటనారాయణ, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌కు 60 కుర్చీలు అందజేత

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : గుంటూరు ప్రభుత్వ సమగ్ర (జీజీహెచ్)ఆసుపత్రి అభివృద్ధికి దాతలు ముందుకు వచ్చి సహాయం చేయడం మరువలేమని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. ఏపీ ఆర్య వైశ్య మహాసభ మహిళా విభాగం ఆధ్వర్యంలో రూ.25 వేలు విలువ గల 60 కుర్చీలను సూపరింటెండెంట్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో ఫోరెన్సిక్ మెడిసిన్ విభాగం హెచ్ఓడి డాక్టర్ ఎం. సుబ్బారావు, మహిళా విభాగం కె శైలజా రాణి, ఎం.రాధ, పోలిశెట్టి యామిని, చక్కా శాంతి, శ్రీ కన్యాకా పరమేశ్వరి దేవస్థానం కమిటీ చైర్మన్ ఎన్. సురేష్, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

సబ్సిడీపై విత్తనాలు సరఫరా

విశాలాంధ్ర - బల్లికురవ : మండల పరిధిలోని అన్ని గ్రామాలలోనీ రైతు సేవా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి ఎస్.వి.పి కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. 30శాతం సబ్సిడీపై కందులు,పెసలు పంపిణీ చేయనున్నట్లు కావలసిన రైతులు ఆధార్ కార్డు,ఫోన్ నెంబర్‌తో రైతు సేవా కేంద్రాలలోని సిబ్బందిని సంప్రదించి విత్తనాల పొందవచ్చునన్నారు.పంపిణీ చేసేందుకు 10 క్వింటాళ్లు కందులు 6 క్వింటాలు పెసలు సిద్ధంగా ఉన్నట్లు ఆమె తెలిపారు.

12న మండల సర్వసభ్య సమావేశం

విశాలాంధ్ర - బల్లికురవ : 12వ తేదీన ఉదయం 11 గంటలకు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బడుగు శ్రీలక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో హనుమ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో రావాలన్నారు.ఎంపీటీసీలు,సర్పంచులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు.

నూతన చట్టాలపై అవగాహన

విశాలాంధ్ర - చీరాల : ఉన్నత న్యాయస్థానాల ఆదేశాల మేరకు చీరాల మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ కూడలి వద్ద న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చీరాల 1టౌన్ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ పి.హరిబాబు హాజరై హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పిస్తూ మారిన నూతన చట్టాల పై కనుగుణంగా హెల్మెట్ లేని వాహన దారులకు భారీగా విధించబోతున్న జరిమానాల గురించి ట్రిపుల్ రైడింగ్,మైనర్ల రైడింగ్ రెక్లెస్ డ్రైవింగ్‌పై నూతన చట్టాలు వేసే జరిమానాలపై అవగాహన కల్పించారు. సోషల్ వర్కర్ పి.యల్.వి యస్.డి.మతీన్, వన్ టౌన్ ట్రాఫిక్ ఏఎస్ఐ,కానిస్టేబుళ్లు తదితరులు పాల్గొన్నారు.

నత్తలతో కంటి చూపు మెరుగు

యానాదుల జీవనానికి నత్తలే ఆధారం

విశాలాంధ్ర - రేపల్లె : రేపల్లె తీరంలోని యానాదుల జీవనానికి నత్తల వృత్తి ఎంతగానో ఉపయోగపడుతుందని వారు వెల్లడిస్తున్నారు. ఏరువాక ప్రారంభం నుండి మాగాని పొలాల్లో దుక్కులు దున్నే సమయంలో నత్తలు భూమిలో నుండి బయటకు వస్తాయని ఆ నత్తలను పొలాల్లోనికి వెళ్లి ఏరుకుని వచ్చి వాటిని పగలగొట్టి నత్త మాంసాన్ని వేరు చేసి కుప్పలుగా ఏర్పాటు చేసి రోడ్డు మార్గంలో పెడితే నత్తలు కావలసినవారు ఒక్కొక్క కుప్ప రూ.50లకు కొనుగోలు చేసి ఇళ్లకు తీసుకువెళ్తారని జూన్,జూలై,ఆగస్టు,మాసాలలో నత్త మాంసం తింటే ఒంటిలో ఉన్న కొన్ని రోగాలతో పాటు కంటి చూపు మెరుగవుతుందని నత్త మాంస ప్రియుల ప్రగాఢ విశ్వాసం.యానాదులు ఈ సీజన్లో భార్యాభర్తలు,తమ పిల్లలతో సహా పొలాలలోనికి వచ్చి మాగాని.పొలాలలోని దుక్కులలో ఉన్న నత్తలను ఏరుకుని వాటిని విక్రయించి జీవనం సాగిస్తూ ఉంటామని యానాదులు వెల్లడిస్తున్నారు. ఈ నత్త మాంసాన్ని ఇక్కడ సాగు చేస్తున్న రొయ్యల చెరువుల రైతులు కొనుగోలు చేసి ఈ నత్త మాంసాన్ని చెరువులలో పెరుగుతున్న రొయ్యలకు ఆహారంగా వేస్తూ ఉంటారు వైరస్ కారణంగా రొయ్యలు చనిపోయే సమయములో కూడా వైరస్ రాకుండా ఉంటుందని

తద్వారా అధిక దిగుబడులు వస్తాయని ఆశాభావం రొయ్య సాగు రైతులకు ప్రగాఢ విశ్వాసం.నత్తలు కూడా మంచి పౌష్టికాహారం అని చాలామంది అభిప్రాయం.కోడి మాంసం,గొర్రె మాంసం,గాడిద మాంసం,చేపలు,రొయ్యలు,పీతలు వంటి వాటి కంటే నత్తల మాంసము ఆరోగ్యానికి అన్ని విధాల మంచిదని ప్రజలు అభిప్రాయం.

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకే తల్లికి వందనం పథకం వర్తింపచేయాలి

- ఎస్టీయూ కర్లపాలెం శాఖ

విశాలాంధ్ర - కర్లపాలెం : ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే తల్లికి వందనం పథకం వర్తింప చేసే విధంగా ప్రభుత్వం ఆలోచన చేయాలని ఎస్టీయూ బాపట్ల జిల్లా ఆర్థిక కార్యదర్శి బొంతా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కర్లపాలెం మండల ఎస్టీయూ ఉపాధ్యాయ సంఘం మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయులకి సభ్యత్వ నమోదును ప్రారంభించిందని తెలిపారు. కర్లపాలెం ఎస్టీయూ అధ్యక్షులు వై.గుడారంకయ్య మాట్లాడుతూ ఉద్యోగులకు 30 శాతం మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు.వివిధ పాఠశాలల ఉపాధ్యాయుల నుంచి సభ్యత్వాన్ని నమోదు ప్రక్రియ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో కర్లపాలెం మండల అధ్యక్షులు ఓ.శ్రీనివాసరావు,మండల కోశాధికారి బి.సుబ్బారావు,ఎస్టీయూ జిల్లా అదనపు కార్యదర్శి ఎన్.బి.సుభానీ,జిల్లా కార్యదర్శి బి.నాగరాజు,వి. శ్రీనివాసరావు, ఎస్.ఏసుదాసు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన మధుబాబు, యూనియన్ నేతలు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మున్సిపల్ ఇంజనీరింగ్-టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు ఈదులమూడి మధుబాబు, కమిటీ సభ్యులు మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిను మర్యాదపూర్వకంగా కలిసి పుష్ప గుచ్ఛం ఇచ్చి శాలువాతో సత్కరించారు. మధుబాబు మాట్లాడుతూ తమరు గుంటూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా విధులు నిర్వహించిన సమయంలో నగరపాలక సంస్థలోని ఔట్‌సోర్సింగ్ కార్మికులందరూ సుఖసంతోషాలతో జీవించారని, వారికి సకాలంలో జీతాలు అందే విధంగా కృషి చేశారని గుర్తుచేశారు. అంతేకాకుండా క్రైస్తవ కార్మికులు అడగగానే వారి మనోభావాలు గుర్తుతెరిగి నగరపాలక సంస్థ తరపున సెమీ క్రిస్మస్‌ను తమరే ప్రారంభించడం జరిగిందన్నారు. అంతేకాకు ండా కార్మికులకు ప్రభుత్వాలు జీతాలు పెంచే క్రమంలో ఇచ్చే ఉత్తర్వులు ఆలస్యం చేయకుండా వెంటనే అమలుపరిచి కార్మికుల సంక్షేమానికి కృషి చేశారని అన్నారు. ఏటీ అగ్రహారం రిజర్వాయర్ కార్మికులు, ఎంపీహెచ్ఏ మేల్, ఫిమేల్ కార్మికులు, కమిటీ సభ్యులు ఏసుబాబు, యాకోబు, విలియంలు పాల్గొన్నారు.

సమతుల ఎరువుల యాజమాన్యంపై అవగాహన

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయం,మట్టి నమూనా పరీక్ష కార్డుల సిఫార్సుల ప్రకారం సమతుల ఎరువుల యాజమాన్యంపై చీరాల మండలంలోని రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సదస్సులో డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ కోఆర్డినేటర్ జిల్లా వనరుల కేంద్రం డిడిఏ ఎం.విజయనిర్మల మాట్లాడుతూ రైతులు విధిగా ప్రకృతి వ్యవసాయం,సమతుల ఎరువుల యాజమాన్యం పద్ధతులు శాస్త్రవేత్తల సిఫార్సుల ప్రకారము వాడాలన్నారు. అందువలన సాగు ఖర్చు తగ్గించుకొని నాణ్యమైన అధిక దిగుబడి పొందవచ్చన్నారు. రైతులు విత్తన శుద్ధి తప్పనిసరిగా పాటించాలని తెలిపారు.ఏరువాక శాస్త్రవేత్త ఉషారాణి మాట్లాడుతూ చీరాల మండలానికి అనుకూలమైన రకాలు తెలిపారు. మొక్కజొన్న,వేరుశనగపంటల రకాలను వివరించారు.ఏరువాక శాస్త్రవేత్త రాధాకృష్ణ వరి,మొక్కజొన్న,వేరుశనగ పంటలలో వచ్చే వివిధ చీడపీడల నివారణ,తెగుళ్ల యాజమాన్యం గురించి వివరించారు.ఏరువాక కో-ఆర్డినేటర్ మురళీధర్ నాయక్

వరి ఎదబెట్టటం, నాట్లు వేయటం,మేలైన యాజమాన్య పద్ధతులు గురించి తెలిపారు.జిల్లా వనరుల కేంద్రం బాపట్ల ఏడిఏ రత్నకుమారి వివిధ పంటల సమగ్ర పోషక యాజమాన్యం గురించి వివరించారు.ప్రకృతి వ్యవసాయం గురించి మాస్టర్ ట్రైనర్ భారతి ప్రకృతి వ్యవసాయం ప్రయోజనాలు,వాతావరణ విపత్తుల సంరక్షణ, ప్రకృతి వ్యవసాయ సూత్రాలు,పురుగులు,తెగులు నివారణ గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో చీరాల ఏడిఏ కె.భాస్కరరావు,మండల వ్యవసాయ అధికారి సుమతి,అన్ని గ్రామాల వ్యవసాయ సహాయకులు, రైతులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి: ఎమ్మెల్యే వేగేశన

విశాలాంధ్ర - బాపట్ల : కష్టాల్లో ఉన్న వారికి అండగా ఉంటానని నియోజకవర్గ ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.మంగళవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ప్రజలు నేరుగా కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు.గత ఐదేళ్లలో ఎలాంటి భరోసా లభించక సామాన్యులు అనేక కష్టాలు ఎదుర్కొన్నారన్నారు. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో అర్థం కాక సతమతమయ్యారన్నారు.పెన్షన్ కోసం వృద్ధులు,వికలాంగులు,మహిళలు, ఉద్యోగాల కోసం యువత సమస్యల పరిష్కారం కోసం వివిధ విభాగాల ఉద్యోగాలు విద్య,వైద్య సాయం కోసం సామాన్యులు తాము ఎదుర్కొంటున్న కష్టాల నుంచి గట్టెక్కేందుకు బాధితులు పెద్ద ఎత్తున తరలివచ్చిన వారి విజ్ఞప్తులను ఆయన స్వీకరించారు.ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నరేంద్ర వర్మ హామీ ఇచ్చారు.దీంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు.

మంత్రి గొట్టిపాటి సమస్య పరిష్కారం

విశాలాంధ్ర - అద్దంకి : కడప జిల్లా ఖాజీపేట మండలం నాగసాని పల్లెలో అబ్బయ్య అనే రైతు పొలంలో విద్యుత్ తీగలు నేలను తాకుతుండేవి. గత కొంత కాలంగా రైతు తాను పడుతున్న ఇబ్బందులను పలు

మంత్రి గొట్టిపాటికి కృతజ్ఞతలు తెలిపిన రైతు

మార్లు అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదు. ఇటీవల వర్షాలు పడడంతో దుక్కి దున్నుకోవాలని రైతు అబ్బయ్య భావించారు.ఈ క్రమంలో పొలంలో అడ్డుగా ఉన్న విద్యుత్ తీగలను కుటుంబ సభ్యుల సాయంతో పట్టుకునేలా చూసుకున్నారు.అయితే దీనికి సంబంధించి ఫోటో ఏపీ విద్యుత్ మంత్రి గొట్టిపాటి రవికుమార్ కంటపడింది.

రైతన్న ఇబ్బంది చూసిందే తడవుగా స్థానికంగా ఉండే అధికారులకు మంత్రి గొట్టిపాటి రవి కుమార్ ఆదేశించారు.యుద్ధ ప్రాతిపదికన అబ్బయ్య పొలంలో స్తంభం ఏర్పాటు చేశారు.ఏళ్ల తరబడి పరిష్కారం కానీ సమస్య మంత్రి గారి ఆదేశాలు అందిన కేవలం మూడు గంటల్లోనే పరిష్కారం అయ్యింది.మంత్రి గొట్టిపాటి రవి కుమార్ చూపించిన చొరవను చూసి రైతన్న ఆనందం వ్యక్తం చేశారు.

ఘనంగా వంశీ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల : బాపట్ల పార్లమెంట్ తెలుగు యువత కార్యదర్శి అడే వంశీ జన్మదిన వేడుకలను బాపట్ల పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన సమన్వయకర్త నామన శ్రీమన్నారాయణ,బాపట్ల టిడిపి అధ్యక్షుడు కావూరి శ్రీనివాసరెడ్డి,పార్టీ నాయకులు తానికొండ దయాబాబు,ఐదుగు నాగేశ్వర రావు,విన్నకోట వీరన్నాయుడు,చినబాబు,నాగరాజు,షాలెంరాజు,రాజేంద్ర, యాకోబు, జాన్సన్, ఎన్.వి.భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీలో డీఎల్‌పీఓ విచారణ

విశాలాంధ్ర - చీరాల రూరల్ : జిల్లా కలెక్టర్ వెంకట మురళీ ఆదేశాల మేరకు చీరాల మండ లంలోని దేవాంగపురి పంచాయ తీలో డీఎల్‌పీఓ దారా హను మంతరావు విచారణ చేపట్టారు. సామాజిక కార్యకర్త దాసరి ఇమ్మాన్యుయేల్ లేవనెత్తిన అంశాలపై స్థానికులతో మాట్లాడి విచారణ జరిపారు. ఆయా ప్రదేశాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భౌతి కంగా ఆయా ప్రాంతాలను పరిశీ లించామన్నారు. ప్రస్తుతం అక్కడ వెంచరుకు సంబంధించిన ఆన వాళ్ళు లేవన్నారు.స్మశాన వాటికలో జరిగిన పనులను పరిశీలించా మన్నారు. స్థానికులతో,సిబ్బందితో, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులతో మాట్లాడి వివరాలు నమోదు చేసు కుంటున్నట్లు తెలిపారు. రికార్డుల ను పరిశీలించి సమగ్ర నివేదికను బాపట్ల జిల్లా కలెక్టర్‌కు అందజే స్తామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బండారు మురళీ బాపూజీ,సిబ్బంది,స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ఎస్సీ, ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని ప్రముఖ సామాజికవేత్త డాక్టర్ గోళ్ళమూడి రాజాసుందర్ బాబు అన్నారు. స్థానిక అంకమ్మ నగర్ ఇద్వా కార్యాలయం నుంచి ఊరేగింపుగా బాధితులతో కలిసి కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. రాజాసుందర్ బాబు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఎస్సీ ఎస్టీలపై జరిగిన దాడులను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడే పరిష్కరించగలరు గుతారన్నారు. ఎన్నికల సందర్భంగా జరిగిన సంఘటనలోని బాధితు లకు కూడా ముఖ్యమంత్రి మంచి చేయాలని విజ్ఞప్తి చేశారు. సమాజం లో అంటరానితనం అత్యాచారాల రూపుమాపేందుకు కోసం పౌర హక్కులను కాపాడేందు కోసం జస్టిస్ పున్నయ్య 42 సిఫార్సులను అమలులోకి తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పిల్లి రాజు, అంబేద్కర్ యూత్ అసోసియేషన్ నాయకులు కోటేశ్వరరావు, వేల్పురి మరియరాణి జోత్స్న, విజయ శాంతి కుమారి, సాగర్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

సీడ్ యాక్సిస్ రోడ్డులో ప్రమాదం

విశాలాంధ్ర-తుళ్లూరు : తుళ్లూరు మండలంలోని లింగాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు వద్ద మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం జరి గింది. స్థానికులు చెప్పిన వివరాల ప్రకారం నెక్కల్లు గ్రామానికి చెందిన సుబ్బారావు(35)గా తెలిపారు. ద్విచక్ర వాహనంపై విజయ వాడ వెళ్తున్నప్పుడు కుక్క అడ్డు రావడంతో ద్విచక్రవాహనం నడుపు తున్న వ్యక్తి సడన్ బ్రేక్ వేశారు. వెనుక కూర్చున్న సుబ్బారావు ఎగిరి డివైడర్‌పై పడటంతో తలకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్రాహ్మణ కోడూరు వద్ద కారు బోల్తా

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండల పరిధిలోని ప్రధాన రహదారి జీబీసీ రోడ్డు బ్రాహ్మణ కోడూరు అడ్డరోడ్డు వద్ద మంగళవారం గుంటూరు వైపు నుంచి బాపట్ల వైపు అతివేగంతో వస్తున్న కారు ప్రమాదవశాత్తు పంట కాలులోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. స్థానికులు పొన్నూరు రూరల్ పోలీసులకు సమాచారం అందించినట్లు తెలిసింది.

వైసీపీ నేతలపై దాడులు ఆపాలి

నూరి ఫాతిమా

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి టీడీపీ వారు వైసీపీ నేతలు, కార్యకర్తలు, పార్టీ కార్యాలయాలపై దాడులకు పాల్పడుతున్నారని గుంటూరు తూర్పు నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త షేక్.నూరిఫాతిమా ఆరోపించారు. సోమ వారం మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో నగరంలోని మల్లికార్జునపేటలో ఉన్న డిప్యూటీ మేయర్ వనామా బాలవజ్రబాబు కార్యాలయంపై దాడి జరిగిన నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఎస్పీని నగరంలో ఉన్న కార్పోరేటర్లతో కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఘటనపై సీసీ కెమెరాల ఆధారాలతో స్థానిక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో పార్టీ నేతలు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. అయితే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సరైన స్పందన లేకపోవడంతో నేడు జిల్లా ఎస్పీని కలిసి ఫిర్యాదు చేసేందుకు వచ్చామని, కానీ ఎస్పీ లేకపోవడంతో ఏఎస్పీని కలిసి ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. టీడీపీ నేతలు ఇలాంటి దాడులను ఆపాలని, లేనిపక్షంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి ఆందోళన చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు అగ్గిపెట్టి రాజు రమ్య, మర్రి అంజలి సత్యం, పోలవరపు జ్యోతి వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన

విశాలాంధ్ర-పొన్నూరు : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని చేబ్రోలు సెక్టార్ సూపర్‌వైజర్ శేషమ్మ అన్నారు. సోమవారం అక్షయ తృతీయ కార్యక్రమంలో భాగంగా చేబ్రోలు సూర్యదేవర ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని విద్యార్థులకు బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్య వివాహ చట్టంపై వివరించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అధ్యాపకులు

పరిశుభ్రమైన తాగునీరు సరఫరా చేయాలి

కలెక్టర్ వెంకట మురళి

విశాలాంధ్ర - బాపట్ల : పరిశుభ్రమైన తాగునీటిని ప్రజలకు సరఫరా చేయాలని అధికారులను జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఆదేశించారు. జల వనరులు, ఆర్డబ్ల్యూఎస్, పబ్లిక్ హెల్త్, వ్యవసాయ, పంచాయితీ రాజ్ తదితర శాఖల అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో ఆయన సమావేశం నిర్వహించారు. మంచినీటి చెరువులలోని నీటిని నిబంధన ప్రకారం పరిశు భ్రపరిచి సరఫరా చేయాలని కలెక్టర్ తెలిపారు. కృష్ణ పశ్చిమ డెల్టా నుంచి జలాలు జిల్లాకు త్వరలో రానున్నాయన్నారు. కాల్వలలో పూడికతీత, తూటికాడ తొలగింపు చర్యలు వేగంగా చేపట్టాలన్నారు. వర్షాలు పడుతున్నందున రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అవసరమైన చోట భూసార పరీక్షలు నిర్వహించాలన్నారు. ఇదే క్రమంలో అంటువ్యాధులు పరబలకుండా వైద్య ఆరోగ్య శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రమైన నీరు విడుదలయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశాలు జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరాధార వార్తలు నిలిపివేయండి

విశాలాంధ్ర - చీరాల : నిజాయతీ పరులపై నిందలేస్తే తగిన మూల్యం చెల్లించక తప్పదని నిరాధార ఆరోపణలతో వార్తలు రాయడం మానుకొని చీరాలలో వున్న సమస్యలపై కథనాలు రాయాలని చీరాల జనసేన,బీజేపీ నాయకులు అన్నారు.సోమవారం చీరాల రోటరీ క్లబ్‌లో సాక్షి పేపర్‌లో వచ్చిన చీరాలలో కొండంత అవినీతి కథనాన్ని ఖండిస్తూ విలేకర్ల సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో బిజెపి,జనసేన నాయకులు మాట్లాడుతూ చీరాల ఎమ్మెల్యేగా మద్దులూరి మాలకొండయ్య గెలిచి కనీసం నెల కూడా కాకముందే వైసీపీ నాయకులు బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారని సముద్రంలో పడి చనిపో తున్న యువకుల కుటుంబాల ఆక్రందన ఈ నాయకులకు కనిపించడంలేదా అని ప్రశ్నించా రు.పనిచేసే నాయకుడు ఉన్నప్పుడు ప్రజా సమస్యలపై కథనాలు ప్రచురిస్తే సమస్యలు పరి ష్కరిస్తారని ఇలాంటి తప్పుడు కథనాలు రాసి జర్నలిస్టుల గౌరవం కోల్పోవద్దన్నారు.రిసార్ట్స్‌కు వచ్చిన యువత సముద్రంలో దిగి చనిపోతుంటే ప్రభుత్వం జిల్లా వ్యాప్తంగా తీసుకున్న చర్యలలో భాగంగా చీరాలలో కూడా కాస్త కఠినంగా వ్యవ హరించారని నాయకుడికి ప్రజా శ్రేయస్సు ముఖ్య మన్నారు.ప్రజలకు మంచి చేస్తుంటే హర్షించా ల్సింది పోయి బురద చల్లడం సరికాదని చీరాల అభివృద్ధికి సూచనలు చెయ్యాలని వైసీపీ నాయకులనుద్దేశించి హెచ్చరించారు.బీసీ నాయ కుడి గెలుపును ఓర్చుకోలేక తప్పుడు కథనాలు తమ మీడియాలో ప్రచురిస్తే అభాసుపాలౌతారని ప్రజలే మీకు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని ప్రజా సమస్యలపై కథనాలు ప్రచురించాలని,తప్పుడు రాతలు మానుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర నాయకులు ముప్పల వెంకట రమణారావు,అరవపల్లి కుమార్,బిజెపి పట్టణ అధ్యక్షుడు నాగేశ్వరరావు,యువమోర్చా నాయకు డు మణి,జనసేన నాయకులు చిరంజీవి యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు జనసేన సీనియర్ నాయకులు మామిడాల శ్రీనివాసరావు,ఉమ్మడి ప్రకాశం జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి గూడూరు శివరాం ప్రసాద్,ప్రోగ్రాం కమిటీ మెంబర్ పాలవలస శ్రీనివాస్, వీర మహిళ కారంపూడి పద్మిని,జనసేన పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుదాసుకు సీపీఐ నాయకులు ఘన నివాళులు

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి మండలం చిన్నకాకాని గ్రామంలోని సీపీఐ సీనియర్ నాయకులు కుక్కమళ్ళ ప్రభుదాసు(65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళ వారం మృతి చెందారు. ఆయన భౌతికకాయానికి సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, సహాయ కార్యదర్శి చిన్ని తిరుపతయ్య, యార్లగడ్డ వెంకటేశ్వర రావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియ జేశారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నాయ కులు బొర్రా మల్లికార్జునరావు, కటారి జేసుదాస్, పొదిలి మరియదాసు తదితరులు ఉన్నారు.

బస్ బేల నిర్మాణాన్ని నిలుపుదల చేయాలి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : గుంటూరు నగరంలో బస్ బేల నిర్మాణానికి ఇచ్చిన అనుమ తులను నిలుపుదల చేయాలని సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి డిమాండ్ చేశారు. స్థానిక గాంధీ పార్క్ వద్ద నిర్మిస్తున్న బస్ బే వద్ద ఏఐటీయూసీ జెండాను మాల్యాద్రి మంగళవారం ఆవిష్కరిం చారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ గుంటూరు నగరంలో ఆర్టీసీ బస్సులు లేకపోయినప్పటికీ 20 బస్ బేలు నిర్మించడానికి నగరపాలక సంస్థ అధికారులు అనుమతులు ఇవ్వడం, అలాగే గతంలో నిర్మించిన బస్ షెల్టర్లను తొలగించడం దుర్మార్గమన్నారు. బస్ బేల కారణ ంగా గాంధీ పార్క్ వద్ద వివిధ వృత్తులలో జీవనం కొనసాగించుకుంటున్న వారందరూ జీవనోపాధిని కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక అవసరం లేని బస్ బేలను నిలుపుదల చేయాలని ఇప్పటికే స్థానికులు కోర్టును ఆశ్రయించడం జరిగిందన్నారు. కోర్టు కూడా స్టే విధించడం జరిగిందని గుర్తుచేశారు. బస్ బేల నిర్మాణాన్ని చేపట్టడం అధికారుల కాసుల కక్కుర్తికి నిదర్శనమని విమర్శిం చారు. వెంటనే బస్ బేల అనుమతులను రద్దు చేయాలని, లేనిపక్షంలో ఉద్యమానికి శ్రీకారం చుడతా మని హెచ్చరించారు. ఆటో యూనియన్ నగర కార్యదర్శి మంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఉన్న ఆటో స్టాండ్‌ను బడా వ్యక్తుల ప్రయోజనాల కోసం తొలగించడం సరైంది కాదని అన్నారు. చిరు వ్యాపారుల సంఘం నేషనల్ ఈసీ మెంబర్ ధూపాటి వెంకట రత్నం మాట్లాడుతూ చిరు వ్యాపారులకు చట్టం ఉన్నప్పటికీ చట్టాలను తుంగలోతొక్కి బస్ బేలకు అనుమతులు ఇవ్వడం దుర్మార్గమని, నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మేడా హనుమంతరావు, ఆటో యూనియన్ నగర అధ్యక్షులు కూరాకుల రాంప్రసాద్, నూతలపాటి వెంకటేశ్వరరావు, సాంబశివరావు, రవి బాబు, వెంకటరమణ, రాహంతుల్లా, నరేష్ రెడ్డి, బషీర్, ఆలే సుబ్బారావు, సాంబశివరావు, బుజ్జిబాబు, శ్రీకాంత్, వెంకటకృష్ణ, నరేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రూ. 5.50 పురుగు మందుల విక్రయాలు నిలిపివేత

విశాలాంధ్ర-కొల్లూరు: అమ్మకాలకు అవసరమైన ధృవీకరణ పత్రాలు లేని పురుగు మందుల అమ్మకాలను విజిలెన్స్, వ్యవసాయశాఖాధికారులు నిలిపివేస్తూ ఆదేశాలు జారీచేశారు. మంగళవారం మండలపరిధిలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. కొల్లూరులోని మూడు దుకాణాలలో ఓ కంపెనీకి చెందిన రూ. 5, 51, 475 విలువైన 230 కిలోల పురుగుమందుల అమ్మకాలను అనుమతి పత్రాలు సమర్పించే వరకు ఎటువంటి విక్రయాలు చేపట్టకూడదన్నారు. దుకాణాలలో ఎరువులు, పురుగుమందులు, విత్తనాల రికార్డులు, బిల్లు బుక్‌లు, స్టాక్ నిల్వలను పరిశీలించి రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సూచించారు. దుకాణాలలో నకిలీ విత్తనాలు, పురుగుమందులు, ఎరువులు విక్రయించడంతో పాటు, నిర్దేశించిన ధరలకు మించి అధికంగా విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు అందితే కఠిన చర్యలు తప్పవని దుకాణదారులను హెచ్చరించారు. తనిఖీలు నిర్వహించినవారిలో విజిలెన్స్ ఎస్ఐ నాగేశ్వరరావు, వ్యవసాయశాఖ సీనియర్ అధికారి రవికుమార్, కొల్లూరు ఏఓ పి. వెంకటేశ్వరరావు, టెక్నికల్ ఏఓ తిరుమలరావు ఉన్నారు.

పన్నులు త్వరగా వసూలు చేయాలి

మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి

విశాలాంధ్ర - చీరాల : చీరాల పురపాలక సంఘ కార్యాలయంలో మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి మంగళవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ చక్రవర్తి మాట్లాడుతూ చీరాల మునిసిపాలిటీ పరిధిలో ఉన్న ఖాళీ స్థలాలకు,మంచినీటి కుళాయిలకు ఆస్తి పన్నులను త్వరితగతిన వసూలు చేయాలని,ఎటువంటి బకాయిలు లేకుండా చూడాలన్నారు.మార్కెట్ సంబంధించి లీజులు,షాప్ లకు సంబంధించిన అద్దెలు కూడా వెంటనే వసూలు చేయాలన్నారు.ఈ సమావేశంలో మునిసిపాలిటీ రెవెన్యూ అధికారులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

వార్డుల్లో సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర - అద్దంకి : అద్దంకి మున్సిపాలిటీలో తమ వార్డుల్లో సమస్యలను పరిష్కరించాలని తెలుగుదేశం పార్టీకి చెందిన వార్డు కౌన్సిలర్లు మంగళవారం అద్దంకి మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణను కోరారు.కమిషనర్ సత్యనారాయణను తెదేపా కౌన్సిలర్లు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు.పట్టణ పరిధిలోని ప్రధాన సమస్యలైనా మురుగు మంచినీటి సమస్యలతో పాటు వీధిలైట్ల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ చూపాలని కమిషనర్‌ను కోరారు.అదేవిధంగా అసంపూర్తిగా మిగిలిపోయిన సిసి రోడ్లు డ్రైనేజీ నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. ప్రధానంగా వీధుల వెంబడి కుక్కల బెడద ఎక్కువగా ఉన్నదని ఆ సమస్య కూడా పరిష్కరించేందుకు సత్వరమే చర్యలు చేపట్టాలని కోరారు.కమిషనర్ను కలిసిన వారిలో కౌన్సిలర్లు మాగులూరి తిరుపతమ్మ,కంపా రజని,మొండితోక సీతమ్మ,రంగశెట్టి సుభాషిని,అత్తులూరి రమేష్ బాబు,గుంటూరు విజయలక్ష్మి,షేక్ జాహిరా ఉన్నారు.

అంకితభావంతో విధులు నిర్వహిస్తే అవార్డులు

ఎస్పీ వకుల్ జిందాల్

విశాలాంధ్ర - బాపట్ల : అంకితభావంతో విధులు నిర్వహించే వారికి అవార్డులు వరిస్తాయని,దానికి నిదర్శనమే జిల్లా పోలీస్ యంత్రాంగం అందుకున్న సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు అని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం వారు జిల్లా పోలీస్ శాఖకు జారీచేసిన సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ ఎస్.బి ఇనిస్పెక్టర్ వి.మల్లికార్జునకి అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ భారత ప్రభుత్వ విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ వారు ప్రతి సంవత్సరం పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ విభాగం నందు ప్రజలకు వేగవంతంగా,అత్యుత్తమ,నాణ్యమైన సేవలు అందించినందుకుగాను సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డును ఇస్తారన్నారు.ఈ సంవత్సరం జిల్లాలోని ఎస్.బి విభాగం పాస్‌పోర్ట్ ల విచారణలో అత్యుత్తమ ప్రతిభ కనపరిచినందుకుగాను విజయవాడ ప్రాంతీయ పాస్‌పోర్ట్ కార్యాలయం వారు బాపట్ల జిల్లా పోలీస్ శాఖకు సర్టిఫికెట్ ఆఫ్ ఎక్సలెన్సీ అవార్డు అందించడం జరిగిందన్నారు.ఈ అవార్డు అందుకోవడం జిల్లా పోలీస్ శాఖకు ఎంతో గర్వకారణమని తెలిపారు. ఇటువంటి అవార్డులను సమిష్టి కృషితోనే సాధించగలమన్నారు. ఎస్.బి యంత్రాంగానికి క్రమపద్ధతిలో తగిన ఉత్తర్వులు ఇస్తూ సమర్థవంతంగా విధులు నిర్వహించ గలిగే విధంగా తయారు చెయ్యడంలో జిల్లా ఎస్.బి అధికారి మల్లికార్జున పాత్ర ఎంతో కీలకమని కొనియాడారు.ఇదే స్ఫూర్తితో ఇతర అధికారులు కూడా విధులు నిర్వహించి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

గురుకుల పాఠశాలలో మౌలిక వసతుల కరవు

విశాలాంధ్ర - యద్దనపూడి : యద్దనపూడి గురుకుల పాఠశాలలో మౌలిక వసతులు కరువయ్యాయని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. స్థానిక అంబేద్కర్ గురుకుల పాఠశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలో శుభ్రత,పరిశుభ్రత లేదని పరిసరాల శుభ్రంగా లేవని వసతిగృహ ప్రాంగణంలో పాములు తిరుగుతున్నాయని బాత్ రూమ్‌లు శుభ్రత లేదని పడకగదులు శుభ్రత లేదని,బాధితహితంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని ప్రిన్సిపాల్ అధికారులతో సమన్వయం లేకుండా వ్యవహరిస్తుందని శానిటైజేషన్ సక్రమంగా లేదని,పాఠశాలలో తాగు నీరు,వాడుక నీరు,డ్రైనేజి సమస్యల ఉన్నాయన్నారు. భోజనం ఇతర సమస్యల గురించి విద్యార్థులను అడిగారు.పాఠశాలలో విద్యార్థులకు ఏ విధమైన ఇబ్బందులు లేకుండా చూడాలి అని మండల అధికారులకు చెప్పారు.తాను గుర్తించిన సమస్యలను గురించి జిల్లా అధికారులకు నివేదిక పంపుతాను అని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎండిఓ శివ సుబ్రహ్మణ్యం, ఎంఇఓ గోపి,ఆర్. డబ్ల్యూ.యస్ ఎ.ఇ బ్రహ్మయ్య,పాఠశాల ఇంచార్జి ప్రిన్సిపాల్ వాణి బాల, సి.డి.పి.ఓ శుభద్ర తదితరులు పాల్గొన్నారు.

డెంగ్యూ నివారణకు కృషి చేయాలి

విశాలాంధ్ర - నిజాంపట్నం : డెంగ్యూ వ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కూచినపూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సూపర్‌వైజర్ మురళి సూచించారు.డెంగ్యూ వ్యతిరేక మాసోత్సవం సందర్భంగా మంగళవారం కూచినపూడి ఎస్పీఆర్ఆర్ హై స్కూల్లో డెంగ్యూ, డయేరియా వ్యాధుల నివారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో డెంగ్యూ, డయేరియాతో పాటు ఇతర అంటూ వ్యాధులు ప్రబలకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.పగటిపూట కుట్టే దోమ వల్ల డెంగ్యూ వ్యాధి వస్తుందని,ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. డెంగ్యూ వ్యాధి సోకిన వారిలో తీవ్ర తలనొప్పి, తీవ్ర జ్వరం,శరీరంపై దద్దుర్లు,కండరాలు,కీళ్ళ నొప్పులు, అలసట మొదలగు లక్షణాలు ఉంటాయన్నారు.ఈ వ్యాధి వ్యాప్తి చెందకుండా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తమ ఇంటి చుట్టుపక్కల ప్రాంతాలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని అలాగే ఇంటి ఆవరణలో పాత టైర్లు,డబ్బాలు,కొబ్బరి బోండాలు, వాడిన కూలర్లు, ప్లాస్టిక్ గ్లాసులు ఇంటి పరిసరాల నుంచి తొలగించాలన్నారు.దోమల నివారణకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలన్నారు. ఎవరికైనా డెంగ్యూ,డయేరియా లక్షణాలు ఉంటే వెంటనే దగ్గరలో గల ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి రక్త పరీక్షలు చేయించుకుని చికిత్సలు తీసుకోవాలని సూచించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పులిగడ్డ నరేంద్ర ప్రసాద్,ఉపాధ్యాయులు,వైద్య సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అగస్టు 15న 'రాష్ట్ర స్థాయి సినీ గీతాల పోటీలు'

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : భారతీ సాంస్కృతిక సంగీత కళావేదిక సేవా సదన్ ఆధ్వర్యంలో అగస్టు 15 గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక అమరావతిరోడ్డులోని శ్రీ గుంటూరు అన్నదాన సమాజం ఆడిటోరియం నందు వర్ధమాన గాయనీ, గాయకులకు రాష్ట్ర స్థాయి సినీ గీతాల పోటీలు జరగనున్నాయని సేవా సదన్ వ్యవస్థాపక అధ్యక్షులు మిరియాల ప్రసాదరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వివరాలకు 9440109795 నెంబర్‌ను సంప్రదించాలని ఆయన వెల్లడించారు.

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సేవల అభినందనీయం

విశాలాంధ్ర - బాపట్ల : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ కర్లపాలెం శాఖ సేవలు అభినందనీయమని బాపట్ల పార్లమెంటు సభ్యులు టి.కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ అన్నారు.మంగళవారం కర్లపాలెం శాఖ వారు పార్లమెంటు సభ్యులను,ఎమ్మెల్యేలను,కలిసి కర్లపాలెం శాఖ యొక్క సేవలను వివరించారు.ఈ సందర్భంగా కర్లపాలెం రెడ్ క్రాస్ చైర్మన్ ఈ.పోలీసురావు మాట్లాడుతూ ఎంపీ,ఎమ్మెల్యే సహకారంతో సేవలను మంచిగా కొనసాగిస్తామన్నారు.ఈ సందర్భంగా గౌరవ పార్లమెంటు సభ్యులను,ఎమ్మెల్యేలను శాఖ వారు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మండల ప్రతినిధులు గంపల వెంకట రెడ్డి, కొలుసు సోమరాజు,కనపర్తి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

విశాలాంధ్ర - రేపల్లె : మండలంలోని నల్లూరుపాలెం గ్రామంలో ఆదివారం మునిపల్లి ఎలీషాగృహం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోయినది.ఒక వస్తువు కూడా బయటకు రాలేదు.మంగళవారం ఎమ్మార్పీఎస్,ఎంఈ ఎఫ్ఎంఎస్పి ఆధ్వర్యంలో 25 కేజీల బియ్యం, నిత్యావసరాలు అందజేసి ఆదుకోవడం జరిగినది. ఎమ్మార్పీఎస్ రేపల్లె అధ్యక్షుడు ఆలూరిభక్తులు,బేతపూడి భాస్కర రావు, బేతపూడి వెంకటేశ్వరరావు,కూచిపూడి రవీంద్ర,కారుమూరి మోహన్‌రావు,కారుమూరి దావీదు,పోలుమట్ల నాగేశ్వరావు,నల్లూరి కిషోర్ పాల్గొన్నారు.